ఓ సారి రుచిచూస్తే దానిమీదకి మనసు ఎలా పరిగెడుతుందో అర్థం అవడంతో, అతనికి లోకంలో దొరికే ఆనందాలేవీ మనిషిని ఎప్పటికీ తృప్తి పరచలేవన్న తత్త్వ జ్ఞానం అబ్బింది. మర్నాడు అతను తన ఇంటికి తిరుగు ప్రయాణం అయాడు.

## 78. కొలిమి పరీక్ష

ఓ గ్రామంలోని ఓ నాస్తికుడు, భక్తుడైన తన కంసాలి మిత్రుడి ఇంటికి వెళ్ళాడు. ఆ కంసాలి చాలా కష్టాల్లో ఉన్నాడు కాబట్టి పరామర్శ చేయడానికి వచ్చాడా నాస్తికుడు. కొద్ది సేపయ్యాక చెప్పాడు నాస్తికుడు.

"నాకిది చాలా వింతగా ఉంది. దేవుడ్ని కొలిచే వాళ్ళకి కష్టాలు పోవాలి కాని నీకు అలాంటిదేం జరగడం లేదే? భగవంతుడు లేడని నిన్ను నమ్మమనడం లేదు కాని, దేవుడంటూ ఉంటే మరి ఈ కష్టాల పరంపర నిన్నే ఎందుకు అంటి పెట్టుకుని ఉన్నట్లు? "

ఆ కంసాలి కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత నాస్తిక మిత్రుడితో చెప్పాడు.

"ఇదిగో. నేను గుర్రపు నాడాగా మార్చాల్సిన ఇనుప బద్దీ ఇది. ముందుగా ఈ ముడి ఇనుముని ఏం చేస్తానో తెలుసా? అది దాదాపు నిప్పులా అయేలాగా నిప్పులో కాలుస్తాను. తర్వాత దాన్ని బయటకి తీసి అది నాకు కావాల్సిన పరిమాణంలోకి వచ్చేలా సుత్తితో నిర్దయగా బాదుతాను. తర్వాత దాన్ని చల్లటి నీటిలో పడేస్తాను. మళ్ళీ చల్లారిన దాన్ని నిప్పులో ఎర్రగా కాల్చి మళ్ళీ సుత్తితో దాన్ని బాదుతాను."

ఆస్తిక మిత్రుడు చెప్పేది నాస్తికుడు శ్రద్ధగా వింటున్నాడు.

"కాని ఒకోసారి ఈ పద్ధతికి తట్టుకోలేని కొన్ని ముడి ఇనుము బద్ధలు నాకు తగులుతూంటాయి. ఆ వేడి, ఆ సుత్తి దెబ్బలు, చన్నీరుకి తట్టుకోలేని అవి గుర్రపు నాడాలని చేయడానికి పనికిరావు. అప్పుడు వాటిని అదిగో, ఆ చెత్త కుప్పలోకి విసిరేస్తాను. ఇంక అవి ఎందుకూ పనికిరావు."

కొద్ది క్షణాల మౌనం తర్వాత అతను తను చెప్పేది కొనసాగించాడు.

"దేవుడు నన్ను కష్టాలనే కొలిమిలో ఉంచి, బాధలనే సుత్తి దెబ్బలు వేస్తున్నాడని నాకు తెలుసు. అందువల్ల నేను పెద్దగా బాధపడను. ఎందుకంటే ఇప్పుడున్న ముడి స్థితి నించి నేను ఏ పరిమాణంలో, ఏ స్థితికి రావాలో దేవుడికి తెలుసు. కాబట్టి కష్టాలొచ్చినప్పుడు నేను దేవుడ్ని ప్రార్థించేది ఏమిటంటే ' ఓ దేవా! దయతో నన్ను నీ పద్ధతిలో ఇంకాస్త మెరుగైన స్థితికి మార్చు. అది తట్టుకునే శక్తి నాకు ప్రసాదించు తప్ప నేను పనికిమాలిన వాడినని ఎంచి నన్ను చెత్త కుప్పలోకి విసిరేయకు. "

## 79. దేవుడికి తెలుసు

కష్టాల్లో మనకి ఎటునించైనా సహాయం అందకపోతే దేవుడికి అసలు మనం ఉన్నామో లేదో తెలుసా అని ఒకొక్కప్పుడు అనిపిస్తుంది. కాని మనల్ని ప్రేమించే దేవుడికి మనం ఏ క్షణంలో ఎక్కడున్నామో స్పష్టంగా తెలుసు. ఎటొచ్చీ ఆ సంగతి మనకే తెలీదు. ఇది ఋజువు చేసే కథ ఇది.

ఓ రాత్రి పుండరీకరావుతో అతని భార్య చెప్పింది.

"నాకు తల నొప్పిగా వుంది. ఇంట్లో తలనొప్పి మాత్ర లేదు. బయటకి వెళ్ళి తీసుకురండి."

టి.వి. చూస్తున్న అతను దాని ముందు నుంచి లేవడానికి ఇష్టపడలేదు. భార్య పోరగా, పోరగా చివరికి మందుల షాపు కట్టేసే సమయానికి తమ వీధికి నాలుగు వీధుల అవతల వున్న మందుల షాపుకి వెళ్ళాడు. అప్పటికే దుకాణం లోంచి బయటకి వచ్చిన దాని యజమాని షట్టర్ దించబోతూ, పుండరీకరావుని చూసి ఆగాడు.

పుండరీకరావు తలనొప్పి మాత్రలు కొన్నాక ఇద్దరూ బయటకి రాబోతూంటే దుకాణంలోని ఫోన్ మోగింది. దుకాణం యజమాని రిసీవర్ ఎత్తి అవతలి వైపు వాళ్ళు చెప్పేది విని, 'ఒన్ సెకండ్' అని పుండరీకరావు వైపు తిరిగి అడిగాడు.

"మీ పేరు పుండరీకరావా?"